క్లుప్తంగా

చురుగ్గా ఉపాధి పనులు



తోట్లవల్లూరు: మండలంలో ఉపాధిహామీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పనులలో కూలీలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. తోట్లవల్లూరులో బుధవారం జరిగిన పనులలో 11 శ్రమశక్తి సంఘాలకు చెందిన 246 మంది కూలీలు పాల్గొన్నారు. ఆర్అండ్బీ రహదారి వెంబడి ఉన్న పంట కాలువ తవ్వకాల పనులను కూలీలు నిర్వహించారు. పనులను ఫీల్డ్ అసిస్టెంట్ చింతలపూడి రమేష్ పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ నివారణకు స్టీలు గ్లాసులు అందజేత

మండవల్లి: ప్లాస్టిక్ నివారణ కోసం మానవత స్వచ్ఛంద సంస్థ స్టీలు గ్లాసులు అందజేసింది. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన గ్రామసభలో 50 స్టీలు గ్లాసులు, స్టీలు ట్రేను మానవత అధ్యక్షుడు గుడివాడ సత్తిబాబు, సత్తిబాబు, ఏసుబాబు, వరిసే కిన్నెరబాబు ఆధ్వర్యంలో అందజేశారు. ఎంపీడీఓ కే రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్, సర్పంచ్ మెండా ఝాన్సీ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి తెలిపారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా పాఠశాల వార్షికోత్సవం




ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఉల్లాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయలక్ష్మి, రఘురామయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు పలురకాల డ్యాన్సులు వేస్తూ ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాబోయే విద్యాసంవత్సరానికి ఇతర పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మంచి ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు.

సామాజిక పింఛన్ల పంపిణీ




గుడివాడ టౌన్: గుడివాడ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. సంఘం నాయకుడు జి. ప్రభాకరరావు మాట్లాడుతూ పేదరికం అనుభవిస్తున్న 36 మంది సామాజికవర్గానికి చెందిన వారికి నెలకు రూ. 500 చొప్పున ప్రతినెల పింఛన్ పంపిణీ చేస్తున్నామన్నారు. బి. జగన్, టి. శ్రీనివాసరావు, వి. పవన్‌కుమార్, జి. రామారావు, డి. రవితేజ, జి. వెంకటేశ్వరరావు, జి. సునిల్, ఎం. సత్యన్నారాయణ, వి. బ్రహ్మజీ, మడకా ప్రసాదు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం



గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఎంటర్ ప్రైజస్ యజమాని పి. వెంకటనాగబాబు సహకారంతో మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని బుధవారం బంటుమిల్లి రోడ్‌లో ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. రమాదేవి. ఏఓ బి.అనంతలక్ష్మి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, గంగాధర్‌రావు, రాజు, అర్జున్, సాయి, బొగ్గారపు తిరుపతయ్య, జాజుల తాతారావు పాల్గొన్నారు.

ఉత్తమ లయన్స్ చైర్మన్‌గా శశికళ



గుడ్లవల్లేరు: ఉత్తమ సేవలను అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు చైర్మన్ శశికళకు జిల్లా స్థాయి ఉత్తమ లయన్స్ చైర్మన్‌గా గుర్తించి పురస్కారం అందించారు. విజయవాడలోని అమ్మ కల్యాణ మండపంలో బుధవారం ఆమెను సన్మానించారని లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్ తెలిపారు. 2024–2025 లయనెస్టిక్ ఇయర్‌లో శశికళకు ఉత్తమ చైర్మన్‌గా ఈ పురస్కారం అందజేసినట్లు పేర్కొన్నారు. లయన్స్ దిలీప్‌కుమార్, శ్రీరామచంద్రమూర్తి, పెరుమాళ్ల, విజయ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం జాడేది?

- తోట్లవల్లూరులో 4,200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- ముమ్మరంగా నూర్పిడి పనులు



తోట్లవల్లూరులో మొక్కజొన్నను ఆరబెట్టిన రైతు

తోట్లవల్లూరు: మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై నీలినీడలు అలముకున్నాయి. మొక్కజొన్న నూర్పిళ్లు ప్రారంభమైనా కొనుగోలు కేంద్రం జాడ లేకపోవటంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. కొనుగోలు కేంద్రం ఏర్పాటైతే కనీస మద్దతు ధర లభిస్తుందనే రైతన్నల ఆశలు ఆవిరవుతున్నాయి. తోట్లవల్లూరు మండలంలో మొక్కజొన్న పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. కృష్ణా కరకట్ట వెంబడి రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పాములలంక, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు గ్రామాల పరిధిలోని లంక, మాగాణి భూముల్లో మొక్కజొన్న సాగయ్యింది. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 4,200 ఎకరాల్లో మొక్కజొన్న పైరును రైతులు ఈ ఏడాది సాగు చేశారు.

ఊపందుకున్న నూర్పిళ్లు

మొక్కజొన్న పంటకాలం పూర్తి కావటంతో మండల వ్యాప్తంగా యంత్రాల ద్వారా కోత, నూర్పిడి పనులను రైతులు చేపట్టారు. కరకట్ట వెంబడి గ్రామాల్లో కొన్ని రోజులుగా నూర్పిడి పనులు జోరుగా సాగుతున్నాయి. వాతావరణం అనుకూలించటం, తెగుళ్ల ప్రభావం పెద్దగా లేకపోటవటంతో దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయి. ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తుండటంతో రైతులకు మొక్కజొన్న సాగు లభసాటిగా మారింది.

ఎదురుచూపు..

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయటంతో రైతులకు గిట్టుబాటు ధర లభించింది. మొక్కజొన్న నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నా ఇంత వరకు కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవటంతో రైతులకు మద్దతు ధర దక్కటం ప్రశ్నార్థకంగా మారింది. క్వింటా మొక్కజొన్నను మార్కెట్‌లో వ్యాపారులు రూ. 2100కు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటైతే మరింత ధర దక్కే అవకాశం ఉందని రైతులు ఆశపడుతున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్‌లో వ్యాపారులు ధరను తగ్గించేస్తున్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటైతే కనీస మద్దతు ధర లభించే అవకాశం ఉంది.

–గోనేపల్లి శ్రీనివాసరావు, రైతు, తోట్లవల్లూరు

నిర్లక్ష్యం తగదు



మొక్కజొన్న నూర్పిళ్లు ఆరంభమైనా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవటం బాధాకరం. కొనుగోలు కేంద్రం ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం తగదు. ఇప్పటికైనా స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి న్యాయబద్ధమైన ధర అందేలా చర్యలు తీసుకోవాలి.

– కాటూరి శివప్రసాద్, రైతు, వల్లూరుపాలెం

ఆదేశాలు రాలేదు



మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం జిల్లా అధికారులకు నివేదించాం. కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సంబంధించి ఇంతవరకు అధికారుల నుంచి ఆదేశాలు రాలేదు. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం.

– జి.నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి, తోట్లవల్లూరు

పలు సమస్యలపై గ్రామసభలో ఫిర్యాదు

మండవల్లి: మండవల్లిలో కొందరు ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని నంబర్లు మార్చి తమ పేరున రిజిస్టర్ చేయించుకుంటున్నారని, అధికారులు ప్రభుత్వ, పోరంబోకు భూములను సరిగా గుర్తించకుంటే మిగిలిన భూములు కూడా అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ టి అప్పారావు, బి రంగారావు, పలువురు గ్రామసభలో వాపోయారు. మండవల్లిలో బుధవారం సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. స్థానిక అగ్రహారానికి తాగునీరు అందడం లేదని సత్తిబాబు, స్వర్ణకుమారి ఆందోళన వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు ఎప్పుడు ఇస్తారని పలువురు అడగ్గా అధికారులు సమాధానం చెప్పలేదు. పీహెచ్‌సీలో ఇరువురు డాక్టర్లకు గాను ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారని, వాష్ రూమ్ సౌకర్యం లేక రోగులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. స్టేషన్ రోడ్డు వరకు నీరు అందడం లేదని సత్తిబాబు, అప్పారావు గ్రామసభలో తెలియజేశారు. కూలింగ్ క్యాన్లతో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని కార్యదర్శి సర్పంచ్ హామీ ఇచ్చారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో భూములు(ఎల్‌పీఎం) సబ్ డివిజన్‌కు బయటవారిని ఆశ్రయించాల్సి వస్తుందని రూ.550కు రూ.5 వేలు నుంచి రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ జొన్నలగడ్డ లక్ష్మి, ఎంపీడీఓ కే రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్ పాల్గొన్నారు.

నూరుశాతం అక్షరాస్యత లక్ష్యం



గుడివాడ టౌన్: పట్టణంలో నూరుశాతం అక్షరాస్యత లక్ష్యంగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో మున్సిపాలిటీ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతమయ్యేలా కృషి చేయాలన్నారు. ఇందుకు కావాల్సిన అన్ని వనరులు ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. ఇందులో క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్, అక్షరాస్యత కల్పించాలన్నారు. సిటీ మిషన్ మేనేజర్ కేఈవీ బసవేశ్వరరావు, సీడీపీఓ ఎ.విజయా ఫ్లారెన్స్, ఎంఈఓ డి. బాలాజి పాల్గొన్నారు.

రాజరాజేశ్వర స్వామికి జలాభిషేకం



గుడ్లవల్లేరు: మండలంలోని పెసరమిల్లిలో శ్రీ రాజరాజేశ్వరీ దేవి సమేత రాజరాజేశ్వర స్వామికి బుధవారం మండలి పూజను పురస్కరించుకుని గ్రామంలోని మహిళా భక్తులు బిందెలతో జలాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి రుద్ర హోమం, 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కమ్మిలి రాధాకృష్ణ, అల్లూరి లక్ష్మణరావు, అల్లూరి రాము, అల్లూరి ఆదియ్యనాయుడు, పట్టపు సురేష్, అల్లూరి శివ శ్రీనివాస్, మత్తి వెంకట శివయ్య పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

మండవల్లి: కానుకొల్లు రైతు సేవా కేంద్రంలో సహాయ సంచాలకులు జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి ఎస్‌కె జరీనా బుధవారం రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీలుగ విత్తనాలు 50 శాతం సబ్సిడీపై కేజీ రూ.61.50 ఉండగా 10 కేజీలు రూ. 615 పడుతుందన్నారు. జీలుగ వేసవిలో వేసుకోవడం వలన ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. నేలకు భూసారం పెరుగుతుందని తెలిపారు. జీలుగ వేయడం వలన నత్రజని సమతుల్యంగా అందుతుందని, పెట్టుబడి కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.

ఘనంగా వీరేశలింగం జయంతి



వీరేశలింగం జయంతి వేడుకలో పాల్గొన్న కళాభిమానులు

గుడివాడ టౌన్: కందుకూరి వీరేశలింగం, ప్రముఖ ఆంగ్ల హాస్య నటుడు చార్లీ చాప్లిన్ జయంతి వేడుకలు బుధవారం స్థానిక కేటీఆర్ కళాశాల రోడ్‌లో గల సత్యసాయి సేవాసమితి మందిరంలో ఘనంగా నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు తెలుగుజాతికి నవయుగ వైతాళికుడని ఇపేర్కొన్నారు. స్త్రీ విద్య కోసం ఉద్యమించి ప్రచారం చేయడమే కాక బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనన్నారు. కళారంగంలో వీరేశలింగం, చార్లీచాప్లిన్ నాటకరంగాభివృద్ధికి చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. కార్యక్రమంలో రంగస్థల నటులు బందారు రాధాకృష్ణ, రచయిత్రి పుట్టి నాగలక్ష్మి, డీఆర్‌బీ ప్రసాదు, షేక్ ఫరీద్‌బాషా, ఆర్‌వీఎల్ నరసింహరావు, నరహరిశెట్టి ప్రసాదు, మట్టా రాజ, పీవీ సత్యనారాయణ, ఏవీఎస్ ప్రసాదు, మల్లిక్, విన్నకోట బుజ్జి పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు నిధుల పెంపు



జాబితాను ప్రదర్శించిన ఏఈ సురేంద్ర

గుడ్లవల్లేరు: పీఎంఏవై–1.0 గృహ నిర్మాణ లబ్ధిదారులకు నిధుల పెంచినట్లు హౌసింగ్ ఏఈ ఎ.సురేంద్ర తెలిపారు. మండలంలోని గృహ నిర్మాణ లబ్ధిదారులకు వారి ఖాతాల్లో జమ అయిన జాబితాను గ్రామాల వారీగా, పంచాయతీ – సచివాలయం నోటీస్ బోర్డ్ నందు బుధవారం ఆయన ప్రదర్శించారు. మన ఇల్లు మన గౌరవం పథకంలో భాగంగా గృహ నిర్మాణాలు చేసుకునే పీఎంఏవై – 1.0 గృహ నిర్మాణ లబ్ధిదారులకు సంబంధించి గత నెల 23నుంచి 28వ తేదీ వరకు ఏఎఫ్ఏ సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆ సర్వే ఆధారంగా ప్రభుత్వం ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు అదనంగా చేకూరుస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం



కైకలూరులో మాట్లాడుతున్న సెక్టార్ సీడీపీఓ దీప్తి

కైకలూరు: తల్లీబిడ్డ ఆరోగ్యం చక్కటి పౌష్టికాహారంపై ఆధారపడి ఉంటుందని కైకలూరు సెక్టార్ సీడీపీఓ డాక్టర్ వీ.దీప్తి తెలిపారు. కైకలూరు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం, వరహాపట్నం –2 కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లల, తల్లుల పోషణ ట్రాకర్‌ను ఆన్‌లైన్ నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రధానంగా పోషకాహారంలో విలువలు, పరిసరాల పరిశుభ్రత, టీకాల కార్యక్రమాలను అందరికీ వివరించాలన్నారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ వి.కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.వెంకటేశ్వరమ్మ, డి.దుర్గాభవానీ, ఎల్.మీనాకుమారి, సీహెచ్.ఆశాలత, బి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

చెరువులో చేపల సేకరణకు బహిరంగ వేలం



ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఆలయ డీసీ వరప్రసాదరావు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లి శ్రీ దుర్గానాగేశ్వరస్వామివారి దేవస్థానానికి చెందిన చెరువులో చేపలు పట్టుకుని, నీరు తోడి అప్పగించేందుకు ఆలయ ప్రాంగణంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా స్థానికులు మారుబోయిన పవన్ కళ్యాణ్ అత్యధికంగా రూ.21,501లకు హెచ్చుపాట పాడినట్లు ఆలయ డీసీ తెలిపారు. మోపిదేవి శ్రీసకలేశ్వరస్వామివారి ఆలయ కార్యనిర్వహణాధికారి జోగి ప్రవీణ, ఆలయ అధికారులు వెంకట రమణ, ఎంపీటీసీ కడకకొల్లు సీతారామాంజనేయులు, గ్రామ పెద్దలు అరజా వెంకటేశ్వరావు, అరజా కిరణ్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తుల అందజేత



స్పోర్ట్స్ దుస్తుల్లో విద్యార్థులు

నందివాడ: మండలంలోని తమిరిశ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కోకో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు 50 జతల స్పోర్ట్స్ దుస్తులను డాక్టర్ మాగంటి శ్రీనివాస్, డాక్టర్ వంశీధర్, డాక్టర్ శ్రీకృష్ణ బుధవారం బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ డేవిడ్ రత్నరాజు, ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు, హెచ్ఎం ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



గుడివాడలో అగ్ని ప్రమాదాల నివారణ విధానాలపై అవగాహన



పామర్రులో అగ్నిప్రమాదాల నివారణపై డెమో

గుడివాడ టౌన్: అగ్నిమాపక వారోత్సవాలు పట్టణంలో మూడో రోజు బుధవారం కొనసాగాయి. స్థానిక రాజేంద్రనగర్‌లోని మానస సరోవరం, ప్రశాంతి అపార్ట్‌మెంట్‌లు తదితర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు నియంత్రించే పద్ధతులను ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ జి.అంజనేయులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: వంట గదులలో అప్రమత్తతతో మెలగితే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్ .రాంబాబు పేర్కొన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం పలు ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక టీకెఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు



ప్రకృతి వ్యవసాయంపై ప్రదర్శన

మండవల్లి: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతుందని మండల ఇన్‌చార్జి నాగవిజయ అన్నారు. మండలంలోని లింగాల, కానుకొల్లు గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. నాగవిజయ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పీఎండీఎస్ పచ్చిరొట్ట పైర్ల విత్తనాలతో ప్రారంభించాలన్నారు. లింగాల నాయకులు బోయిడి సురేష్ బాబు, కానుకొల్లు సర్పంచ్ నాగదాసి థామస్, ముదినేపల్లి మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మాదవకుమార్, శ్యాంప్రసాద్, వీఏఏలు వర్మ, సంధ్య, డ్వాక్రా బుక్ కీపర్లు సునీత, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే బుధవారం కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐసీటీ అకాడమీ అధిపతి ఎన్. దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించు కోవాలన్నారు. ఉపాధి సృష్టించుకునే వారికి భవిష్యత్ ఉంటుందన్నారు. వారు ఎదుగుదల చూస్తారన్నారు. అనంతరం బీటెక్ పూర్తయిన విద్యార్థులకు గ్యాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



భుజబలపట్నంలో విద్యార్థులను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కైకలూరు: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో భుజబలపట్నం జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల ప్లస్–2 బాలికలు మండల స్థాయిలో మొదటి స్థానాలను సాధించారు. దీంతో కైకలూరు ఏపీటీఎఫ్ నాయకులు బొర్రా శ్యామ్‌సుందర్ ప్రతిభ చూపిన విద్యార్థులు, చదువులు చెప్పిన అధ్యాపకులను స్కూల్లో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డి శ్రీనివాసరావు, సంఘ నాయకులు అక్బర్ హుస్సేన్, జకావుల్లా, స్కూల్ హెచ్ఎం ఎన్‌వీఎల్.రాజేశ్వరీ, ఉపాధ్యాయులు రాజారావు, శ్యామలరావు, రామారావు, హరిశంకర ప్రసాద్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

బళ్లారి రాఘవకు ఘన నివాళి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: కళారంగానికి తాడిపత్రి రాఘవాచార్యులు (బళ్లారి రాఘవ) కలికితురాయి అని కళాభిమానులు అన్నారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సాహితీ స్రవంతి, ప్రజా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో బళ్లారి రాఘవ వర్ధంతి సభలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వేలాది ఆంగ్ల, తెలుగు నాటిక ప్రదర్శనలు ఇచ్చి తెలుగు నాటక రంగానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన ఘనుడు రాఘవ అని కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన నాటిక ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వై. కోటేశ్వరరావు, బందారు రాధాకృష్ణ, వసుధ బసవేశ్వరరావు, కోటేశ్వరి, రేరాజు, కె. బాబు, ఖాసీం, ఆర్‌సీపీ రెడ్డి, ఎల్. సురేంద్ర, మాల్యాద్రి, అవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



కృత్తివెన్ను పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

కృత్తివెన్ను: రెండు జిల్లాలకు సరిహద్దుగా ఉన్నటువంటి కృత్తివెన్ను మండలంపై అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. పోలీస్ స్టేషన్ తనిఖీలో భాగంగా ఆయన బుధవారం జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్‌తో కలిసి కృత్తివెన్ను స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, మండలంలో క్రైం రేటు తదితర అంశాలను ఎస్ఐ పైడిబాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జాతీయ రహదారి రావడంతో ప్రమాదాల సంఖ్య పెరిగిందన్నారు. ప్రమాదాల నివారణకు మూడు సంవత్సరాలుగా జరిగిన సంఘటనలు బ్లాక్‌స్పాట్‌గా గుర్తించి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలిస్తామన్నారు. హైవే పక్కన ఎక్కువగా చిల్లర దొంగతనాలు జరుగుతున్న విషయాన్ని ఆయనకు తెలపగా దీనిపై లోకల్ పోలీసులకు తగు సూచనలు చేస్తామన్నారు. ప్రమాదాలు, దొంగతనాల విషయంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఈ మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటు వాటి పర్యవేక్షణ బావుందన్నారు. నాయకుల విగ్రహాలకు రక్షణగా కమిటీలు ఉండాలని విగ్రహం ఏర్పాటు చేసే సమయంలోనే లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు బాధ్యతలు వారే చూసుకోవాలన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 22 వేల సీసీ కెమెరాల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటికి 21 వేల కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఉండి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని వెయ్యి సీసీ కెమేరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.